క్లుప్తంగా

శివ స్వాములకు భిక్ష



ధరూరు: శివమాల ధరించిన శివభక్తులు గురువారం మండల కేంద్రానికి గ్రామానికి చెందిన బుచ్చన్న, అంజనమ్మ దంపతులు ఆంజనేయ స్వామి ఆలయంలో శివ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ స్వాముల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిష్టాచార్యులు, గురుస్వాములు బోయ మల్లి, దర్శెల్లి, శివ స్వాములు సీతారాములు, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కేటీదొడ్డి: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం ముర్కిదొడ్డి గ్రామానికి చెందిన భీమన్న, తాయన్నలు ఆ రాష్ట్రం నుంచి చింతలకుంటకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చింతలకుంట గ్రామ శివారులో ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భీమన్న, తాయన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మొక్కల పెంపకంపై దృష్టి



మల్దకల్: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు సద్దలోనిపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీలలో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని నిర్వాహకులకు సూచించారు. 100 శాతం మొక్కలు బతికేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరందించి వాటిని సంరక్షించాలన్నారు. పంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో కంటివెలుగును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు యాకోబు, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్లు సీజ్



కేటీదొడ్డి: అక్రమంగా కిరాణం దుకాణంలో నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు సీజ్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలో డీఎస్‌ఓ రేవతి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గృహ అవసరాల కోసం వినియోగించే సిలిండర్లను గ్రామానికి చెందిన రాఘవేంద్రశెట్టి అక్రమంగా ఉంచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారని సమాచారం మేరకు దాడులు చేయగా అక్రమంగా నిల్వ చేసిన సిలిండర్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సీజ్ చేసిన 10 సిలిండర్లను తహసీల్దార్ కార్యాలయంలోని అప్పజెప్పారు.

విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలలో గత నెలలో వేదిక్ మ్యాథ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో 30 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సరోజిని స్మార్ట్ లర్నింగ్ ట్రస్ట్ డైరెక్టర్ మురహరి విద్యార్థులకు మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఓ స్వప్న, పీఈటీ అరుణ తార పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులలో ఎంపిక చేసిన 40 మందికి స్పోర్ట్స్ మెటీరియల్‌తో పాటు పోలీసు యూనిఫాంలను గురువారం అందించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎస్పీసీ ద్వార విద్యార్థులకు సేవా కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

రోడ్లున్నా.. బస్సు రాదాయె!



బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

- పల్లెలకు అందని ఆర్టీసీ సేవలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పరిమితికి మించి ఆటోలో ఎక్కుతున్న ప్రయాణికులు

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో పల్లె ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాల్సిన అధికారులు అటువైపు చర్యలు కూడా తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్లువేసినా బస్సు సౌకర్యం లేక వివిధ గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. బస్సు రాక కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నా ఫలితం లేకుండా పోతుందని పల్లె ప్రజలు వాపోతున్నారు. ఇటిక్యాల మండలంలో ఎర్రవలిచౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, పాత గార్లపాడు వరకు బీటీ రోడ్డు సక్రమంగా ఉన్నా బస్సులు రాకపోకలు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అదే విధంగా పొగాకు కంపెనీ నుండి మునగాల, ఇటిక్యాల మండలకేంద్రం, ఉదండాపురం, చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల వరకు కూడా బీటీ రోడ్డు ఉంది. కానీ ఆర్టీసీ బస్సు సకాలంలో తిరగకపోవడంతో వందల సంఖ్యలో ప్రయాణికులు నిత్యం అష్టకష్టాలు పడుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రైవేట్ ఆటోలలో ప్రయాణం సాగిస్తున్నారు.

గ్రామీణులకు తప్పని తిప్పలు

ఇటిక్యాల మండలంలో పలు గ్రామాలకు బస్సు వసతి లేని కారణంగా ప్రజలు నిత్యం ప్రైవేట్ వాహనాలలో ప్రయాణిస్తున్నారు. మండలంలోని పెద్దదిన్నె, గోపల్‌దిన్నె, షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు, వేముల, బట్లదిన్నె, వల్లూరు గ్రామాలకు కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ముప్పు తిప్పలు పడుతున్నారు. అంతకు ముందు గద్వాల డిపో నుంచి మూడు రూట్‌లలో పల్లెల మీదుగా ఆర్టీసీ బస్సులు నిత్యం తిరిగేవి. కానీ కరోనా కారణంగా లాక్‌డౌన్ నుంచి బస్సు సౌకర్యం లేని కారణంగా ప్రజలు ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తూ ప్రమాదాలను బారిన పడుతున్నారు. ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని వాపోతున్నారు.

ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం

నిత్యం మండల కేంద్రంతో పాటు ఎర్రవల్లిచౌరస్తాకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిదులు స్పందించి పల్లెలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఎర్రవల్లిచౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా కారుపాకులకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయాణికులు రాకోపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– రవికుమార్, కారుపాకుల గ్రామం

అధికారులు పట్టించుకోవడం లేదు



పల్లెలకు బస్సులను నడపాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణిస్తున్నాం. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రామాంజనేయులు, సాసనూలు గ్రామం

విద్య, వైద్యానికి పెద్దపీట



మన ఊరు-మన బడి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఉండవెల్లి: విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. గురువారం మండల కేంద్రంలో మన ఊరు– మన బడి మొదటి విడుత కార్యక్రమంలో భాగంగా రూ.19.85 లక్షల నిదులతో వివిధ పనులను చేపట్టారు. ప్రాథమిక పాఠశాలలో రూ.7.85 లక్షలతో మరుగు దొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి, రూ.12 లక్షలతో వివిధ పనులను సర్పంచు రేఖతో కలిసి ఎమ్మెల్యే అబ్రహం ప్రారంభించారు. వెంకటరమణ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రూ. 10.20 లక్షల వ్యయంతో అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనుసూయమ్మ కాలనీలో రూ. 5లక్షల వ్యయంతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేశారు. రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, రూ.10 లక్షల సీడీపీ నిధులతో చేపట్టనున్న నాలుగు సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే భూమి చేశారు. రూ.12 లక్షలతో పునఃనిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళ సమైఖ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని మహిళ సంఘాల అధ్యక్షురాలు, అధికారులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఆర్యవైశ్య సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆ సంఘం సభ్యులు సూరయ్య, ఫణిభూషన్ విన్నవించారు. వీఆర్‌ఏల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు, వీఆర్‌ఏలు ఎమ్మెల్యేను కోరారు. ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని పీఈటీలు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ ధీటుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవన్న, ఉప సర్పంచు మగ్బుల్, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, మండల కోఆప్షన్ మెంబర్ చిన్న బాస్ మియ్యా, దామోదర్ రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ సలీమ్, ఏఈ నరేందర్, ఎంఈఓ శివ ప్రసాద్, ఎంపీఓ పద్మావతి, ఆస్మా, తహసీల్దార్ వీరభద్రప్ప, హెచ్‌ఎం సుజాత, సత్యనారాయణ, కుమార్ పాల్గొన్నారు.

బీసీల కుల గణన చేపట్టాలి



మాట్లాడుతున్న మణికుమార్

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వాలు బీసీల కుల గణనను సత్వరమే చేపట్టాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు, కారుపాకుల గ్రామాలలో కోటి సంతకాల సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, ఉపేందర్, రాంబాబు, రాముడు, తదితరులు ఉన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి



వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, డాక్టర్ యాకుబ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరంను వారు సందర్శించారు. మొత్తం 161 మందికి కంటి పరీక్షలు, 21 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రన్న, అనసుయమ్మ, రాణి, నసీమాబేగం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ


అమరచింత: క్షయ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉంటూ వైద్యులు సూచించిన మాత్రలు వేసుకుంటే త్వరగా వ్యాధి నుంచి కోలుకునే అవకాశం ఉందని సీఐ రత్నం అన్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా అందించే పౌష్టికాహార పదార్థాలను టీబీ వ్యాధిగ్రస్తులకు గురువారం అందించారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వసంత, డాక్టర్ నిసార్‌అహ్మద్‌తో కలిసి క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు అందించారు. వారం రోజుల కంటే ఎక్కువగా దగ్గు వస్తున్నా, దగ్గినప్పుడు తెమడతో పాటు రక్తం పడుతున్న వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



అలంపూర్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ర్యాలంపాడు గ్రామానికి చెందిన గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. గర్భిణులు తరుచుగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఆధార్ కార్డు అప్‌డేట్



రాజోళి: ప్రభుత్వం విద్యార్థులకు ఆధార్ కార్డు అప్‌డేట్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల ఆధార్ కార్డును అప్‌డేట్ చేశారు. ఈ సందర్భంగా 1 నుంచి 5 తరగతి విద్యార్థులకు ఆధార్ కార్డును పరిశీలించి, వారి ముఖచిత్రం, వేలి ముద్రలను తీసుకున్నారు. కార్యక్రమంలో గజేంద్ర రెడ్డి, సురేష్ తదిదరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో గురువారం జాతీయ రహదారిని దాటుతున్న ఓ వానరంను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు పరుశ, రఘు, సాత్విక్, భాస్కర్‌లు వానరానికి సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలను నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఇంటింటి సర్వే చేస్తున్న సీఐటీయూ నాయకులు

అలంపూర్: ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపాలిటీలో సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అనేక మంది పేదలు ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఇరుకు ఇండ్లలో కాలం వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3 లక్షలను రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి అయ్యప్ప, గంగన్న, షుకుర్, ఖలీల్, శాలిమియ్య తదితరులు ఉన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ



ఎర్సందొడ్డిలో పశువులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



అయిజలోని కుటుకనూరులో..

కేటీదొడ్డి: పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహిస్తునట్లు ఇర్కిచేడు, ఎర్సందొడ్డి సర్పంచులు మాధవి, గోపాల్ అన్నారు. గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో 8 నెలల వయస్సు గల దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 85 పశువులకు వ్యాక్సినేషన్ వేసినట్లు పశువైద్య సిబ్బంది మోహన్ తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ మిత్రులు గోపాల్‌రెడ్డి, భీమయ్య, రైతులు ఉన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని కుటుకనూరు, మూగోనిపల్లి గ్రామాల్లో గురువారం మొత్తం 50 దూడలకు బ్రుసెల్లోసిస్ టీకాలను వైద్య సిబ్బంది వేశారు. కార్యక్రమంలో గిడ్డయ్య, సుధాకర్, తిరుమలేష్, మూర్తి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో పశువులకు బ్రూసెల్లోమస్ టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి శిరీష తెలిపారు. గురువారం గ్రామంలో మొత్తం 36 దూడలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శివ, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఆశకార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు



వైద్య నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

గద్వాల అర్బన్: కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని కోరుతూ ఆశవర్కర్లు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్య నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల యూనియన్ నాయకులు పద్మ, సునీత, కాంతమ్మ, మాధవీ, సరస్వతీ, జయమ్మ, ప్రమీల, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. కనీస వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి పేద ప్రజలకు సేవ చేస్తున్నామని కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ కాశపోగు రాజు

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లకు మహర్దశ వచ్చిందని జెడ్పీటీసీ కాశపోగు రాజు అన్నారు. గురువారం వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నెలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం పల్లెల్లో మట్టిరోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మిస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, ఇమ్మానియేలు, రాజు, అశ్వత్థానారాయణ రెడ్డి, రామలింగం, నాయుడు, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యరెడ్డి, మద్దిలేటి, పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులకు శిక్షణ



కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో శిక్షణ టీచర్లు

మానవపాడు: మండలంలోని కేజీబీవీలో గురువారం వేదిక్ మ్యాథ్స్ ఆర్గనైజర్ మురహరి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సులభమైన రీతిలో గణితంపై విద్యార్థులు పట్టుసాధించడానికి డిసెంబర్ 10 మార్చి 10 వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 6, 7, 8, 9, తరగతి చదివే 180 మంది విద్యార్థులలో 36 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి గోల్డ్ మెడల్‌ను శిక్షణ టీచర్ల ఆధ్వర్యంలో బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అనురాధ, వేదిక్ మ్యాథ్స్ టీచర్లు ఉషారాణి, శ్రీలీల, మహేశ్వరి, శ్రీదేవి, షాహిన్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ

అలంపూర్: పట్టణ కేంద్రంలో దళిత శక్తి ప్రో గ్రాం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కా ర్యక్రమం నిర్వహించారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, తదితరులు సంతకం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ మహరాజ్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికార సాధనకు డాక్టర్ విశారదన్ మహరాజ్ 10 వేల కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్ర, శ్రీను, శంకర్, లక్ష్మణ్, తిమ్మన్న, మౌలాలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.